సంతకు సొంత స్థలం

మాల్ పశువుల సంతకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే ఆదేశం

- 640 సర్వే నంబరులో ఐదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించే అవకాశం
- ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చే యోచనలో అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


మాల్‌లో పశువుల సంతకు కేటాయించాలనుకుంటు్న భూమి ఇదే

యాచారం: మాల్ పశువుల సంత నిర్వాహణకు కావాల్సిన స్థల ఎంపికకు మోక్షం కలిగే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల మాల్ గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గ్రామ సర్పంచ్ పడకంటి కవిత, వార్డు సభ్యులు సంతకు స్థలం కేటాయించే విధంగా కృషిచేయాలని విన్నవించారు. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దులోని యాచారం మండల పరిధిలో ఉన్న మాల్ గ్రామంలో ప్రతి మంగళవారం పశువుల సంత కొనసాగుతుంది. సంత నిర్వాహణ వేలంపాట ద్వారా ప్రతి యేటా మాల్ గ్రామ పంచాయతీకి రూ.45 లక్షలకు పైగానే ఆదాయం వస్తుంది. సంత వేలం పాటలో వచ్చే ఆదాయంతోనే మాల్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు, సిబ్బంది జీతాలకు ఖర్చు చేస్తారు. పశువుల సంతతో పాటు ప్రతి మంగళవారం అంగడి జరగడంతో పశువుల క్రయ, విక్రయాలతో పాటు రైతులు తమకు కావాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాలు కొనుగోలు చేసి తీసుకెళ్తారు. వివిధ గ్రామాల నుంచి వేలాది పశువులు, పాడి గెదేలు, గొర్రెలు, మేకలు రావడంతో సంతకు సరిపడా స్థలం లేక ప్రైవేట్ వెంచర్లల్లోనే సంత కొనసాగిస్తున్నారు. సంతకు స్థలం కేటాయించాలని గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ పాలకవర్గం మంత్రులకు, జిల్లా కలెక్టర్లకు విన్నవించినా ఫలితం లేకపోయింది. గ్రామ సర్పంచ్ కవిత విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో ఫోనులో మాట్లాడి మాల్ పశువుల సంతకు కావాల్సిన స్థలం కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు.

ఐదెకరాల్లోనే అన్ని...

మాల్ గ్రామం మధ్యలోనే 640 సర్వేనంబరులో 16–20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం పశువుల సంత 640 సర్వే నంబరు పక్కనే ఉన్న వెంచర్లల్లో కొనసాగుతోంది. 640 సర్వే నంబర్‌లో 5 ఎకరాల స్థలాన్ని పశువుల సంతకు కేటాయించి అందులోనే పశువుల సంత నిర్వాహణ జరిపేలా, రోడ్డుపై నిర్వహిస్తున్న మటన్, చికెన్, చేపల దుకాణాలను అక్కడికే తరలించి ప్రజలకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వెంచర్లల్లో కొనసాగుతున్న పశువుల సంతలో నీడ, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడంలేదు. ఎదో తూతూమంత్రంగా టెంట్లు వేసి పంచాయతీ నుంచి రూ.లక్షలాది నిధులు నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. పశువుల సంతకు శాశ్వత స్థలం ఎంపిక వల్ల ఒకేసారి షెడ్లు, భవనాలు నిర్మిస్తే పంచాయతీకి గణనీయమైన ఆదాయంతో పాటు వృథా ఖర్చులు తప్పే అవకాశం ఉంటుంది.

వినియోగంలోకి బస్టాండ్..

మాల్ గ్రామంలోని నల్లవెల్లి చౌరాస్తాలో ఎకరాకు పైగా స్థలంలో 20 ఏళ్ల కింద ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. మొదట్లో ఆర్టీసీ బస్సులు వచ్చిపోయేవి. బస్టాండ్‌లోనే కూరగాయల మార్కెట్ కొనసాగడంతో ప్రయాణికులు కూడా వచ్చేవారు. కూరగాయల మార్కెట్ నల్లగొండ జిల్లా వెంకటేశ్వర్‌నగర్‌లోకి మారిపోవడంతో ప్రయాణికులు, రైతులు, వ్యాపారులు రాకపోవడంతో బస్సులు కూడా బంద్ అయ్యాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్‌లోని ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆర్టీసీ బస్టాండ్‌ను వాడుకలోకి తెచ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే..



పశువుల సంతకు మాల్‌లోని సర్వే నంబరు 640లో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని అడగ్గానే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడారు. అదే విధంగా మాల్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను కూడా వాడుకలోకి తెచ్చే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కూరగాయల మార్కెట్ కూడా నడిపించేలా అధికారులు కృషి చేయాలి. - కవిత, సర్పంచ్, మాల్

మాల్ అభివృద్ధికి కృషి



రంగారెడ్డి– నల్లగొండ జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్ కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా. మాల్‌లో పశువుల సంత, అంగడి జరగడంతో నిత్యం రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతుంది. మాల్‌లో పశువుల సంతకు 5 ఎకరాల శాశ్వత స్థలం కేటాయిస్తా. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడాను. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను వాడుకలోకి తెచ్చి సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే బస్సులు వచ్చి, పోయేలా కృషిచేస్తా.

- మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

జీపీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శంకర్

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సర్పంచ్ శంకర్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఇటీవలే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగిందని.. పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరగా.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు.ఈ మేరకు బుధవారం ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌గౌడ్, కేశవులు, శ్రీరాములు, భరత్, రామకృష్ణ, జాన్యా, నర్సింహ, వెంకటేశ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

పన్నులు చెల్లించండి: కమిషనర్

తుర్కయంజాల్: ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్స్‌లను తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన క్షేత్ర పరిశీలనలో భాగంగా పలు వార్డుల్లో పర్యటించి పన్ను వసూల్ల తీరును పరిశీలించారు. పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముందస్తుగా పన్నులు చెల్లిస్తున్న పలువురిని కమిషనర్ అభినందించారు.

కడ్తాల్ మండలాన్ని ఆదర్శంగా నిలుపుతాం

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కడ్తాల్: అభివృద్ధిలో కడ్తాల్ మండలాన్ని ఆదర్శంగా నిలుపుతామని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో డ్వాక్రా మహిళా సంఘం భవన నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ తులసీరాంతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ భవన నిర్మాణానికి సంబంధించి రూ.5 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేశారు. భవన నిర్మాణ సమయంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి మరో రూ.5 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ తులసీరాంనాయక్, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఎంపీటీసీ సక్రి, నాయకులు పాండునాయక్, హర్యానాయక్, వార్డుసభ్యులు పత్తి, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వాతి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన జంగమ్మ, రాములమ్మ, మండల పరిధిలోని పెద్దవేములోని బావితండాకు చెందిన చంద్యా, సునీత ఇటీవల వివిధ అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున నాలుగు కుటంబాలకు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబాలకు వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.10 వేలు, పెద్దవేములోనిబావి తండాకు చెందిన శ్వేత భూనాత్‌నాయక్ రూ.10వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు భూనాథ్, మల్లయ్య, చంద్రయ్య,లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

యువత రక్తదానం చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


శిబిరంలో ఎమ్మెల్యే శంకర్‌పల్లి

తలకొండపల్లి: రక్తదానంతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పైగా ఆరోగ్యం మరింత పదిలంగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామకృష్ణాపురంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్‌తో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రయిటర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఎంపీటీసీ రమేష్, సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, ఉప సర్పంచ్ మణికంఠ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయ ప్రారంభోత్సవం


విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

తలకొండపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కోట మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా కొనసాగాయి. గుడి నిర్మాణదాత సర్పంచ్ పెరుమాళ్ల లలితాజ్యోతయ్య ఆధ్వర్యంలో ఆలయ వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఉదయం తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహాలకు శుద్ధజలంతో అభిషేకం చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ లలితజ్యోతయ్య చెప్పారు. మాజీ జెడ్పీటీసీ నర్సింహ, ముదిరాజ్ నాయకుడు యాదయ్య, జ్యోతయ్య, వార్డు సభ్యుడు దశరథం, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించండి

తుర్కయంజాల్: రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమర్‌ఖాన్ గూడ కౌన్సిలర్ శ్రీలత బుధవారం జిల్లా రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రావణ్ ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోహెడ నుంచి సంఘీనగర్‌కు వెళ్లే రోడ్డులో అనేక మలుపులు ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లతో పాటు జిగ్‌జాగ్ క్రాసింగ్ లేన్ల ఏర్పాటు, వీధి దీపాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. నాయకులు అనిల్, నల్ల మల్లారెడ్డి, దానయ్య, యోజిత్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురండి

- యాచారంలో నిరుపయోగంగా ఎస్సీ కమ్యూనిటీ సహకార దుకాణ సముదాయం
- నిరుద్యోగులకు కేటాయించాలని వినతులు


ఎస్సీ కమ్యూనిటీ దుకాణ సముదాయం

యాచారం: నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ సహకార దుకాణ సముదాయ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని ఆ వర్గం ప్రజలు కోరుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో గత 25 ఏళ్ల కింద ఎస్సీ సామాజికవర్గం వారు ఎవైనా వ్యాపారాలు చేసుకునే నిమిత్తం రూ.రెండున్నర లక్షలు ఖర్చు చేసి భవనాన్ని నిర్మించి ఐదు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎస్సీ సామాజిక వర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ భవనంలో ఎదైనా వ్యాపారం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నదే సర్కార్ లక్ష్యం. అంతవరకు భాగానే ఉన్నా నేడు ఆ దుకాణాలు పూర్తిగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. సాగర్ హైవేపై ఈ స్థలం ధర ప్రస్తుతం రూ.కోటికి పైగా డిమాండ్ ఉంటుంది. ఎస్సీ సామాజిక వర్గం వారు ఆ దుకాణాలు లీజుకైనా ఇవ్వాలని పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను అడిగినా స్పందన లేకపోవడంతో ఊరుకున్నారు. ఈ దుకాణాలున్న భవనం పక్కనే యాచారం పీఏసీఎస్ భవనం, ప్రభుత్వాస్పత్రి, విద్యుత్ కార్యాలయాలు ఉన్నాయి. ఎవైనా దుకాణాలు పెట్టుకుంటే నిరుద్యోగ యువత ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. ఇదే విషయమై ఎంపీడీఓ విజయలక్ష్మిని సంప్రదించగా యువత అర్జీలు పెట్టుకుంటే, ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని లీజుకు ఇస్తామని తెలిపారు.

ఘనంగా గద్దర్ జయంతి


గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: యూత్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో బుధవారం ప్రజా యుద్ధనౌక, దివంగత గాయకుడు గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు కొంకణి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంకాల కరుణాకర్, రాజు, మహేష్ మహరాజ్, పగడాల నగేష్, శ్యామ్, ఇమ్రాన్, కిరణ్, అమరేందర్, సల్మాన్, సోహెల్, అయాన్, సాయి పాల్గొన్నారు. గద్దర్ ఆశయసాధనకు కృషిచేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగరావుపల్లి, రామృకృష్ణాపురం, దేవుని పడకల్, రాంపూర్, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు, తదితర పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రయిటర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్లమ్మ, తిరుపతయ్య, శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, వరలక్ష్మి, రాజేందర్‌రెడ్డి, రమేష్, ఎంపీటీసీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, అంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కార్యకర్తలతో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లురవి


కార్యకర్తలతో మాట్లాడుతున్న మల్లురవి

తలకొండపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లురవి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలో పర్యటించిన ఆయన పడకల్ గేట్ వద్ద కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి అధిష్టానం నియమించే అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైయిటర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, అంజయ్యగుప్తా, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలకు సర్పంచ్‌లే వెన్నెముక

సన్మాన కార్యక్రమంలో నేతలు

తలకొండపల్లి: గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మాజీ ఎంపీటీసీ యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో సర్పంచ్ దాసరి కిష్టమ్మ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలకు సర్పంచ్‌లు వెన్నుముఖ వంటివారని పేర్కొన్నారు. ప్రజల బాగోగులు చూడటంతో పాటు గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తారని అన్నారు. అనంతరం సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలకు సర్పంచ్ కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ పట్టాభిరామశర్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ నర్మద ఆధ్వర్యంలో..


మంచాల: సర్పంచ్‌లను సన్మానించిన నేతలు

మంచాల: మంచాల మండల కార్యాలయంలో సర్పంచ్‌లను బుధవారం ఎంపీపీ నర్మద ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్మద మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్‌లు గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించడం జరిగిందన్నారు. వారి పదవీకాలం ముగియనుండడంతో వారి సేవలను గుర్తించి సన్మానించడంతో పాటు జ్ఞాపికలను అందజేసిన్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా పంచాయతీ రాజ్ శాఖ డీఈఈగా పదోన్నతి పొందిన అబ్బాస్‌ను కూడా ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ మర్రినిత్య రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లది కీలక పాత్ర


కడ్తాల్: పాలకవర్గాన్ని సన్మానించిన నాయకులు

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని జిల్లా గిరిజన నాయకులు బిక్కునాయక్ అన్నారు. మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీకాలం పూర్తిచేసుకున్న గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సహకరించిన అందరికీ సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సేవ్యానాయక్, ఉప సర్పంచ్ శ్రీను నాయక్, వార్డు సభ్యులు బిక్కునాయక్, వాల్యానాయక్, పాండునాయక్, మున్యానాయక్, రాజునాయక్, బీచ్యా, పరుశ్‌రాం, జ్యోతి, మంజుల,సేవ్యా, రవి, వరలక్ష్మి, గణేశ్, నాయకులు మున్యానాయక్ లచ్యానాయక్, రంగా,సేవ్యా,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ కొప్పు సుకన్య


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: కేసీఆర్ సర్కార్ హయాంలో పంచాయతీలకు పైసా నిధులు ఇవ్వలేదని, అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు చేసిన బిల్లులను తాజా ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల పరిధిలో ని కుర్మిద్దలో బుధవారం రూ.కోటికి పైగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేసీఆర్ సర్కార్ హయాంలో పైసా నిధులు ఇవ్వలేదని, గ్రామ పాలన అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందని అన్నారు. నిధులు వస్తాయనే ఆశతో సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే పైసా నిధులు ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేసిందని అన్నారు. తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రాధాన్యత కింద సర్పంచ్‌లకు పెండింగ్ నిధులు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్‌లకు కూడా నిధులు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కుర్మిద్ద గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు సన్మానం


వీడ్కోలు సమావేశంలో వార్డుసభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేళ్లు పూర్తికావడంతో పాటు తమ పదవీ కాలం ముగిసిన సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఐదు సంవత్సరాల పాటు కలిసికట్టుగా గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవడం గర్వంగా ఉందని వార్డుసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..


ఆర్థికసహాయం అందజేస్తున్న మల్లేష్‌గౌడ్ మిత్రులు

తలకొండపల్లి: మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అతడి స్నేహితులు ఔదార్యం చాటారు. మేమున్నామంటూ ముందుకు వచ్చి చేయూతనందించారు. రూ.లక్షా పదివేల ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వివరాలు.. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతిని వీధిన పడే పరిస్థితి దాపురించింది. మృతి చెందిన మల్లేష్‌గౌడ్‌తో 1998–99 ఏడాదిలో పదోతరగతి చదివిన మిత్రులు ఆ కుటుంబానికి చేయూతనందించారు. బుధవారం వారి ఇంటికి చేరుకుని మల్లేష్‌గౌడ్ పిల్లల చదువుకోసం రూ.లక్షా పదివేలను ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వెల్జాల్‌లో రాచమల్ల భాస్కర్ తల్లి మృతిచెందడంతో రూ.పదివేల ఆర్థికసహాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

పాఠశాల సమయానికి బస్సులు నడపాలి


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు, గ్రామస్తులు

కడ్తాల్: పాఠశాల తరగతుల సమయానికి బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని న్యామతాపూర్‌లో విద్యార్థులతో కలసి షాద్‌నగర్–కడ్తాల్ ప్రధాన రహదారిపై బుధవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. న్యామతాపూర్ గ్రామం నుంచి కడ్తాల్, మక్తమాధారం తదితర గ్రామాలకు చదువుకోవడానికి గ్రామానికి చెందిన విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, పాఠశాల తరగతుల సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో తరగతులు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు పాఠశాల తరగతుల సమయానికి బస్సులు నడపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థులు ఉన్నారు.